కొత్త కలెక్టర్ టీఎస్ చేతన్

జిల్లాలో జేసీగా పనిచేసిన అనుభవం

పల్నాడు జిల్లాకు అరుణ్‌బాబు బదిలీ



నూతన కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, జూలై 2: జిల్లా కలెక్టర్‌గా టీఎస్ చేతన్ నియమితుడయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. అమరావతిలో బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తున్న టీఎస్ చేతన్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఈయన జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా గతంలో పనిచేశారు. 2022 నుంచి 2023 మధ్య ఏడాదిపాటు కొనసాగారు. దీంతో జిల్లా పరిస్థితులపై టీఎస్ చేతన్‌కు అవగాహన ఉంది.

పల్నాడు జిల్లాకు అరుణ్‌బాబు..

జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న అరుణ్‌బాబును బదిలీ చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా ఆయనను నియమించారు. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత రెండో కలెక్టర్‌గా అరుణ్ బాబు గతేడాది ఏప్రిల్‌లో బదిలీపై వచ్చారు. 14 నెలలపాటు కలెక్టర్‌గా కొనసాగారు.

కదిరి వైసీపీలో ముసలం

పీఠం కదిలేనా?

- చైర్‌పర్సన్‌పై అసమ్మతిబావుటా
- వైసీపీ కౌన్సిలర్ల రహస్య సమావేశం





కదిరి, జూలై 2: పట్టణ వైసీపీలో అసమ్మతి తీవ్రమవుతోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీషాపై అసమ్మతి బావుటా ఎగురవేస్తున్నారు. ఆమెను పదవి నుంచి దించేందుకు అసమ్మతి కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. ఆ దిశగా రెండ్రోజుల క్రితం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రహస్య సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఐదు నెలలుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేని చైర్‌పర్సన్ ఎందుకనీ, వెంటనే రాజీనామా చేయాలని అసమ్మతి కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మొత్తం 36 మంది కౌన్సిలర్లలో ఇప్పటికే 12 మంది టీడీపీలో కొనసాగుతున్నారు. మరో 15 మంది వైసీపీ కౌన్సిలర్లు అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. ఈప్రకారం చూస్తే చైర్‌పర్సన్ పూర్తిగా కౌన్సిలర్ల మద్దతు కోల్పోయినట్లు తెలుస్తోంది. అసమ్మతి కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్ రాజీనామాపై గళం పెంచుతున్నట్లు సమాచారం. రాబోయే కౌన్సిల్ సమావేశాల్లో కూడా ఇదే అజెండాతో ముందుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద వైసీపీలో అసమ్మతి ముదురుతోంది. ఈ పరిణామాలను టీడీపీ అధిష్ఠానంతో పాటు కౌన్సిలర్లు గమనిస్తున్నారు.

రంగం సిద్ధం

మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీషాను దించేందుకు వైసీపీలోని అసమ్మతి కౌన్సిలర్లు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ ముగిశాక జూన్ నెలలో కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. దీంతో కౌన్సిలర్లలో అసమ్మతి పెరిగిపోయింది. పలు అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయనీ, చైర్‌పర్సన్ అసమర్థతే ఇందుకు కారణమని మండిపడుతున్నట్లు సమాచారం. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్లకే చైర్‌పర్సన్ రాజీనామా చేయాల్సి ఉండేది. మూడేళ్లవుతున్నా రాజీనామా చేయకపోవడంపై పలువురు వైసీపీ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన తరువాతే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం అప్పటిదాకా ఆగే పరిస్థితి కనిపించట్లేదు. కౌన్సిల్ భేటీ, బయట అసమ్మతి స్వరం పెంచి ఒత్తిడి తేవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

రహస్య భేటీ

చైర్‌పర్సన్‌పై తీవ్ర అసమ్మతితో ఉన్న 15 మంది కౌన్సిలర్లు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రసహ్య సమావేశం నిర్వహించినట్లు సమావేశం. సమావేశంలో చైర్‌పర్సన్‌ను దించడమే అజెండాగా చర్చలు సాగినట్లు తెలుస్తోంది. లేదంటే సహాయ నిరాకరణ చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తే అందులోనూ స్వరం పెంచాలని నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద అసమ్మతి కౌన్సిలర్లు రహస్య సమావేశం నిర్వహించడంపై పట్టణంలో తీవ్ర చర్చ సాగుతోంది.

కౌన్సిలర్ల మద్దతు కరువు?

మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 12మంది టీడీపీలో ఉండగా, మరో 15 మంది వైసీపీ కౌన్సిలర్లు అసమ్మతి రాగం వినిపిస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలో 27 మంది కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఉన్నట్లు తెలుస్తోంది. సంఖ్యాపరంగా చూస్తే చైర్‌పర్సన్‌కు మద్దతు కరువైనట్లు తెలుస్తోంది. అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెడితే ఈసంఖ్యపై స్పష్టత వస్తుంది. నాలుగేళ్ల పదవీ కాలం నిబంధన ఉండడంతో అసమ్మతి కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్‌ను దించడానికి మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం.. అవిశ్వాస తీర్మాణం పెట్టే కాలాన్ని మూడేళ్లకు తగ్గిస్తూ ఆర్డినెన్స్ తెచ్చే అవకాశమున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ మేరకు ఆర్డినెన్స్ వస్తే చైర్‌పర్సన్‌ను పీఠం నుంచి దించడం ఖాయమని అసమ్మతి కౌన్సిలర్లు గంటాపథంగా చెబుతున్నారు.

అర్ధరాత్రి వీఆర్ వెనుక...!

మహిళ ఫిర్యాదుతో ఉన్నతాధికారులు సీరియస్

పురం టూటౌన్ సీఐపై చర్యలు

వైసీపీ హయాంలో పోలీసు అధికారి అత్యుత్సాహం



సీఐ రియాజ్ అహ్మద్

హిందూపురం, జూలై 2: పట్టణ టూటౌన్ సీఐ రియాజ్ అహ్మద్‌ను సోమవారం అర్ధరాత్రి వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన మంగళవారం ఉదయమే ఎస్పీ వద్ద రిపోర్టు చేసుకున్నారు. అర్ధరాత్రి వీఆర్‌కు పంపడం పోలీసు శాఖలో కలకలం రేపింది. ఎన్నికలకు కొన్ని నెలల ముందు హిందూపురం టూటౌన్ సీఐగా రియాజ్ అహ్మద్ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు చిత్తూరు జిల్లాలో పనిచేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా ఉండటంతో హిందూపురానికి బదిలీ చేశారన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఆయన ఇక్కడ వ్యవహరించిన తీరుపై పలుమార్లు టీడీపీ నాయకులు.. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. పోలింగ్ రోజు కూడా ఆయన పరిధి దాటి వ్యవహరించారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద అత్యుత్సాహం ప్రదర్శించినట్లు తెలిసింది.

మహిళ ఫిర్యాదుతో..

సీఐ రియాజ్ అహ్మద్‌పై ఓ మహిళ ఈనెల 1వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోలీసు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కోట ప్రాంతానికి చెందిన ఆమె.. సీఐ తనను వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది మే నెలలో సీఐ.. ఆ మహిళను రెండో వివాహం చేసుకున్నారు. పెళ్లి చేసుకున్న వారానికే వేధించడం ప్రారంభించారు. వాటిని భరించలేక ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. మొదటి భార్య విడాకులు ఇచ్చిందని సీఐ అబద్ధం చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అదికూడా ఆయన జన్మదినమైన మే 25న పెళ్లి చేసుకున్నట్లు ఆమె తెలిపారు. రెండో పెళ్లి చేసుకున్న మహిళ.. 15 ఏళ్ల క్రితమే భర్తను వదిలేశారు. విషయాన్ని కొంతమంది.. సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడి సీఐ పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. మోడల్ కాలనీలోని మసీదులో పెళ్లి జరిగింది. వారం రోజులు తిరక్కుండానే సీఐ వేధించడం ప్రారంభించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నట్లు స్పందనలో తెలిపింది.



సీఐ పెళ్లి ఫొటో (ఫైల్)

వైసీపీ హయాంలో అత్యుత్సాహం

సీఐ రియాజ్ అహ్మద్ చిత్తూరు జిల్లాలో పనిచేసే సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించినట్లు సమాచారం. చంద్రబాబు నాయుడు గతేడాది ప్రతిపక్ష నాయకుడిగా చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్లగా.. డీఎస్పీ సుధాకర్ రెడ్డితోపాటు సీఐ రియాజ్‌అహ్మద్ అడ్డగించి, పెద్దిరెడ్డి ఆదేశాలతో అత్యుత్సాహం ప్రదర్శించినట్లు అప్పట్లో టీడీపీ నాయకులు ఆరోపించారు. ఆ కారణంతోనే పెద్దిరెడ్డికి అనుకూలంగా ఉన్న వేణురెడ్డి భార్య దీపిక హిందూపురం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగడంతో సదరు సీఐని ఇక్కడికి పంపించినట్లు అప్పట్లో వైసీపీ నాయకులు బహిరంగంగా చెప్పుకున్నారు. ఈ పరిస్థితుల్లో సదరు సీఐ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

ఎస్పీ వద్ద రిపోర్టు చేసుకున్న సీఐ

జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సీఐ రియాజ్ అహ్మద్‌పై ఇటీవల రెండో పెళ్లి చేసుకున్న మహిళ.. ఫిర్యాదు చేశారు. విషయాన్ని ఎస్పీ, డీఐజీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ వెనువెంటనే రాత్రి 10గంటలు దాటాక సీఐని వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం ఉదయం సీఐ జిల్లా కేంద్రానికి చేరుకుని, రిపోర్టు చేశారు.

ప్లీజ్.. మా సమస్యలు పరిష్కరించండి..

మంత్రికి కేజీబీవీ విద్యార్థినుల లేఖ

సోషల్ మీడియాలో వైరల్

పెనుకొండ టౌన్, జూలై 2: తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి వద్దనున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) విద్యార్థినులు.. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు లేఖ రాశారు. ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్ సెకెండియర్ వరకు దాదాపు 250 మంది విద్యార్థినులు ఉన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ పలుమార్లు సమగ్రశిక్ష ఏపీసీ, జీసీడీఓలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని లేఖలో పేర్కొన్నారు. 'మీరైనా పరిష్కరించాలని మంత్రిని కోరారు. పాఠశాలలో తాగడానికి మంచినీరు లేదనీ, ఫైన్ల రూపంలో డబ్బు వసూలు చేస్తున్నారనీ, రాత్రివేళల్లో సిబ్బంది ఉండరనీ, పాఠశాల వద్దకు కార్లు, బైక్‌లు రాత్రివేళల్లో వస్తుంటాయనీ, టీసీ ఇవ్వాలంటే రూ.500 వసూలు చేస్తున్నారనీ, వైసీపీ స్కూల్ కమిటీ అండతో టీచర్లు వేధిస్తున్నారనీ, ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తున్నారని వాపోయారు.

హిందీ టీచర్‌ను సస్పెండ్ చేయండి

తమను ఇబ్బంది పెడుతున్న హిందీ టీచర్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థులు లేఖలో డిమాండ్ చేశారు. టీచర్ వేధింపుల కారణంగా చదువుకోలేకపోతున్నామన్నారు. విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపామనీ, ఎవరికీ చెప్పుకోలేక నిస్సహాయ స్థితిలో ఉన్నామని వాపోయారు. పలువురు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు మంత్రిని కలిసి విన్నవించినట్లు సమాచారం.

విచారిస్తాం: సంపూర్ణ, కేజీబీవీ ఇన్‌చార్జి

కేజీబీవీలో సమస్యలు నాదృష్టికి రాలేదు. నెలరోజుల క్రితమే బాధ్యతలు తీసుకున్నా. అమడగూరు ఎంఈఓగా పనిచేస్తున్నా. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. విచారించి, చర్యలు తీసుకుంటాం.



సోమందేపల్లి కేజీబీవీ

ధర్మవరాన్ని ఆదర్శంగా

తీర్చిదిద్దుతా

మంత్రి సత్యకుమార్ యాదవ్



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూలై 2: అన్నిశాఖల సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషిచేస్తానని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆయాశాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ... నియోజకవర్గంలో 6వేలమంది అంగవైకల్యంతో బాధపడుతున్నారన్నారు. పక్షపాతం నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి మంజులవాణిని ఆదేశించారు. నీటి సమస్య ఎక్కడ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నదే తన కర్తవ్యమన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేయాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంటుందన్నారు. నియోజకవర్గంలో అధికంగా నేతన్నలను ఆదుకోవడానికి కేంద్రం నుంచి అధిక మొత్తంలో నిధులు రాబట్టేందుకు కృషి చేస్తాననీ, అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, విద్యుత్‌శాఖ ఎస్ఈ సుధాకర్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ ఏడీ రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తిరూరల్, జూలై 2: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి క్లెయిమ్ సెటిల్మెంట్, రహదారి భద్రత కమిటీల సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి, జైలుశిక్ష పడేలా విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రవాణాశాఖలు సమన్వయంతో స్పెషల్‌డ్రైవ్‌లు చేపట్టాలన్నారు. జిల్లా విద్యాధికారులు స్కూల్ పిల్లల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయించి, ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించేలా యాజమాన్యాలకు తెలియజేయాలన్నారు.

ప్రమాదాలను తగ్గించాలి

పోలీసులు, రవాణా శాఖ సమష్టి కృషితో రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారులపై వాహనాలు నిలపకుండా చూడాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి కరుణాసాగర్‌రెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రనాయక్, విద్యాశాఖ ఏడీ రామకృష్ణ, కదిరి, పెనుకొండ మున్సిపల్ కమిషనర్లు రంగస్వామి, కిరణ్‌కుమార్, ఆర్టీసీ ఆర్ఎం మదుసూదన్, జిల్లా స్థాయి క్లెయిమ్ సెటిల్మెంట్ కమిటీ, రోడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ కబ్జాలపై ఉక్కుపాదం

ఆక్రమణల కూల్చివేత



కూల్చేసిన షెడ్

కదిరి, జూలై 2: గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు చేసిన కబ్జాలపై ఉక్కుపాదం మోపారు. ఆయా స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను మంగళవారం ఎక్స్‌కవేటర్లతో కూల్చేశారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు పట్టణంలో విచ్చలవిడిగా కబ్జాలు చేశారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాలను కబ్జా చేసి, దర్జాగా నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైసీపీ ఆక్రమణలను పలుమార్లు అడ్డుకున్నారు. అధికారులు.. వైసీపీ కబ్జాదారులకే వత్తాసు పలికారు. కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీ కబ్జాలపై చర్యలకు ఉపక్రమించారు. ఆ మేరకు ఎమ్మెల్యే కందికుంట సోమవారం తెలిపారు. మంగళవారం స్థానికులు, టీడీపీ నాయకులు కలిసి ఆక్రమణలను తొలగించారు. సైదాపురం 206 సర్వే నంబరులో 83 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. దానికి 15 ఏళ్ల క్రితం పట్టాలు తెచ్చుకున్నారు. వారందరూ అనర్హులుగా ప్రభుత్వం తేల్చింది. అయినా ఆ భూమి తమదేనంటూ పట్టాదారులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా వైసీపీ నాయకుడు కుర్లి శివారెడ్డి.. అధికారులను బెదిరించి, మూడు సెంట్ల స్థలంలో షెడ్ నిర్మించారు. దీనిని తాజాగా కూల్చివేశారు. వైసీపీకి చెందిన పలువురు నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో కొత్త బైపాస్ రోడ్డు వద్ద 30 సెంట్లకుపైగా స్థలాన్ని కబ్జా చేశారు. పట్టాలు లేకుండానే బేసిమెంట్లు నిర్మించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే దీనిపై చర్యలు ప్రారంభించారు. బేసిమట్టాలను ఎక్స్‌కవేటర్లతో కూల్చేశారు. కబ్జాలను తొలగించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరిన్ని కబ్జాల జాబితాను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు పంపుతున్నారు. వైసీపీ పాలనలో చేసిన కబ్జాలు, అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కందికుంట స్పష్టం చేశారు. చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుని, ప్రభుత్వ స్థలాలను కాపాడతామని ఆయన ఉద్ఘాటించారు.



బైపాస్‌రోడ్డు వద్ద అక్రమ నిర్మాణాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

రేపు విద్యాసంస్థల బంద్

విద్యార్థి సంఘాల నేతలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పుట్టపర్తి, జూలై 2: జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టు ఏజెన్సీ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈనెల 4వ తేదీన విద్యాసంస్థల బంద్ చేపట్టనున్నట్లు విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్లను మంగళవారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు వీరేష్, నాగార్జున, ఏఐఎస్ఏ, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శివకుమార్, రంజిత్, ప్రసాద్ విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. నీట్ నిర్వహణలో ఘోరంగా విఫలమైందన్నారు. పరీక్షల నిర్వహణలో తీవ్ర అవకతవకలు, మూల్యాంకనలో వ్యత్యాసాలకు పాల్పడ్డారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. నీట్ కుంభకోణంపై సమగ్ర విచారణ చేయించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాల విడుదల

కొత్తచెరువు, జూలై 2: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయని జిల్లా పరీక్షల విభాగాధికారి లాజర్ ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యార్థులు ఓపెన్ టెన్త్‌లో 56 శాతం, ఇంటర్‌లో 68శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.200, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఏపీఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ ద్వారాగానీ, వెబ్‌సైట్‌లో పేమెంట్ గేట్‌వే ద్వారాగానీ రుసుము చెల్లించవచ్చని ఆయన సూచించారు.



వైభవంగా ఖాద్రీశుడి వెండిరథ

ప్రాకారోత్సవం

కదిరి పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వెండిరథ ప్రాకారోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను వెండిరథంపై కొలువుదీర్చి కదిరి మల్లెలు, తులసీ మాలతో అలంకరించారు. ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారోత్సవం వైభవంగా సాగింది. భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. - కదిరి



వెండిరథంపై ఊరేగుతున్న శ్రీవారు, వెండి రథంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు

పాలిటెక్నిక్ అధ్యాపకుడికి అవార్డు


వీరస్వామి

కదిరి అర్బన్, జూలై 2: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ వేమల వీరాస్వామికి జ్యువెల్ ఆఫ్ ఇండియా అవార్డు దక్కింది. న్యూఢిల్లీకి చెందిన కేటీకే ఫౌండేషన్ దేశంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన వ్యక్తులను ఈ అవార్డులతో సత్కరిస్తోంది. ఆ సంస్థ కొరియర్ ద్వారా పంపిన ఆ అవార్డును తాను మంగళవారం అందుకున్నట్లు వీరాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

తుంగభద్రకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్, జూలై 2: తుంగభద్ర జలాశయంలోకి ఇన్‌ఫ్లో రోజు రోజుకు పెరుగుతోంది. జలాశయంలోకి మం గళవారం 13,410 క్యూసెక్కుల నీరు చేరింది. ప్రస్తుతం జలాశయంలో 1585.87 అడుగుల నీటిమట్టం ఉండగా 7.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అవుట్ ఫ్లో 297 క్యూసెక్కులు ఉంది. దీంతో బొమ్మనహాళ్, కణేకల్లు ప్రాంతాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తుంగభద్ర జలాశ యంపై ఆధారపడిన రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ యాప్ నుంచే బిల్లులు చెల్లించండి

అనంతపురం రూరల్, జూలై 2: విద్యుత్ బిల్లులను ఇక నుంచి ఏపీఎస్పీడీసీఎల్ యాప్ ద్వారా చెల్లించాలని విద్యుత్ శాఖ టెక్నికల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఆ మేరకు సంస్థ నుంచి ఈనెల 1వతేదీన ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల అనుసరించి ఇక మీదట ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లలో ఏపీఎస్పీడీఎల్ డిస్కమ్ పేరు కనిపించదన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని లేదంటే డిస్కం వెబ్‌సైట్ నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సంస్థ వెబ్ సైట్ నందు బిల్లులు చెల్లించేటప్పుడు బిల్‌డెస్క్‌లో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్ వాడవచ్చన్నారు. అలాగే డెబిట్, క్రెడిట్, నెటి బ్యాకింగ్, వాలెట్, క్యాష్‌కార్డులను కూడా వాడవచ్చన్నారు.

సైనిక శిబిరం ఎంపికకు శిక్షణ


మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారి

కూడేరు, జూలై 2: ఢిల్లీలో జరిగే తల్ సైనిక్ శిబిరానికి తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కమాండర్ కల్నల్ రమేష్ పేర్కొన్నారు. మండలపరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి దాదాపు 520 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కల్నల్ రమేష్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాంపుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. తల్‌సైనిక్ క్యాంపులో శిక్షణ పొందిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు.

చేయూత దొరికేనా..?



- వైసీపీ పాలనలో నిర్వీర్యమైన సొసైటీలు
- రూ.కోట్లలో పేరుకుపోయిన ఎన్‌పీఏలు
- సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితి
- హెచ్‌ఆర్ పాలసీ అమలులో తీవ్ర నిర్లక్ష్యం
- పంట రుణాలు ప్రారంభించని వైనం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 2: వైసీపీ పాలనలో సొసైటీలు నిర్వీర్యమయ్యాయి. ప్రభుత్వం చేయూత కొరవడటంతో సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని స్థితికి చేరాయి. ఉమ్మడి జిల్లాలోని 115 సొసైటీల్లో సుమారు మూడు లక్షల మంది రైతులు ఖాతాదారులుగా ఉన్నారు. ఇప్పటివరకు రూ.600 ఔట్ స్టాండింగ్ రుణాలు, రూ.150కోట్ల వరకు ఎన్‌పీఏలు ఉన్నాయి. ప్రతి ఏటా జూన్ చివరి నాటికి రూ.600కోట్ల పంట రుణాలు రెన్యువల్ పూర్తి చేయాలి. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు పంటరుణాల రెన్యువల్ ప్రారంభించలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో కొన్నేళ్లుగా తిష్టవేసిన సీనియర్ అధికారుల ఆధిపత్యపోరు, సమన్వయలోపం సొసైటీలను నిర్వీర్యం చేస్తున్నాయి. రుణాలు చెల్లించకపోవడం, పంట రుణాలు రెన్యువల్ చేయకపోవడంతో సొసైటీల టర్నోవర్ పూర్తిగా పడిపోయింది. ఆర్‌బీకేల సాకుతో గత ఐదేళ్లుగా సొసైటీల్లో ఎరువుల అమ్మకాలను నిలిపివేసిన ప్రభుత్వం వాటి ఆర్థిక పురోగతిని అడ్డుకుంది. మితిమీరిన రాజకీయ జోక్యం, ఇచ్చిన రుణాలు సక్రమంగా వసూలు కాకపోవడంతో సొసైటీలు మరింత నష్టాల్లో కూరుకుపోయాయి.


ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

ఏడాదిగా అందని జీతాలు

గత ఏడాది నుంచి సొసైటీల్లో పని చేసే సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితి ఉంది. జిల్లాలో సుమారు 115సొసైటీలు ఉండగా ఇందులో సుమారు 70సొసైటీలు నష్టాలలో కూరుకుపోయాయి. దీంతో ఉద్యోగులకు ఏడాదిగా వేతనాలు చెల్లించడం లేదు. దీంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయి. 2019లో టీడీపీ ప్రభుత్వం సొసైటీ ఉద్యోగులకు జారీ చేసిన హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కాలయాపన చేసింది. ఇది కూడా ఉద్యోగులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెట్టింది.

తక్కువ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అమలు

ఇతర బ్యాంకులతో పోలిస్తే ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని సొసైటీల్లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ తక్కువగా ఉండటంతో రైతులు సొసైటీలలో రుణాలు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. పొరుగు జిల్లాలు కర్నూలులో ఎకరానికి రూ.60వేలు, చిత్తూరులో 70వేలు చెల్లిస్తున్నారు. అయితే జిల్లాలో మాత్రం రూ.32వేలకు మించి ఎకరాకి రైతుకు పంట రుణాలు ఇవ్వడం లేదు. అంతేగాక ఆప్కాబ్ నుంచి వచ్చే షేర్ క్యాపిటల్ (లాభం)లో రైతులకు వాటా చెల్లించడం లేదు. ఇతర బ్యాంకులలో కనీసం ఎకరాకు రూ.40వేలకు పైగా చెల్లిస్తున్నారు. ఈనేపథ్యంలో సొసైటీల్లో రుణాలు తీసుకునే రైతుల సంఖ్య తగ్గింది. దీంతో సొసైటీల టర్నోవర్ కూడా తగ్గింది.


నష్టాల్లో కూరుకుపోయిన కూడేరు సొసైటీ

రుణాలు ఇవ్వరు.. రెన్యువల్ చేయరు..

గత ఏడాది రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో సొసైటీలు నిర్లక్ష్యం వహించాయి. నాబార్డు, ఆప్కాబ్‌ల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ పంట రుణాలు ఇవ్వలేదంటే గత ప్రభుత్వ పాలకులకు రైతుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. నాబార్డు, ఆప్కాబ్‌లు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని నిధులు ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. ఏడీసీసీ బ్యాంకులో పనిచేస్తున్న అధికారుల నిర్వాకం, సవాలక్ష ఆంక్షలు, ముడుపులు ఇవ్వలేదనే అక్కసుతో రైతులకు పంట రుణాలు మంజూరు చేయడం లేదనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి.

రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలి: హరికృష్ణ, ఆంజనేయులు, సొసైటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు



గత ఐదేళ్లుగా సొసైటీలకు ఇవ్వాల్సిన రాయితీలను ప్రభుత్వం నిలిపివేసింది. మొత్తం లాభంలో సొసైటీలకు ఇవ్వడం లేదు. ఐదేళ్లకు రూ.53కోట్లు రావాల్సి ఉండగా రూ.రెండు కోట్లు మాత్రమే చెల్లించారు. మిగిలిన రూ.51కోట్లు ఎక్కడికి వెళ్లింది? ఎవరు తిన్నారనే అంశంపై విచారణ జరిపించాలి. సొసైటీ ఉద్యోగులకు ఏడాదిగా వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ఉద్యోగుల కుటుంబాలు ఎలా బతకాలి. సొసైటీలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూపించి, సక్రమంగా రైతులకు పంట రుణాలు, రెన్యువల్ చేయాలి అప్పుడే టర్నోవర్ పెరుగుతుంది. సొసైటీలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలో పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. మితిమీరిన రాజకీయ జోక్యం తగ్గించాలి.

సొసైటీలను అభివృద్ధి చేస్తాం: సురేఖారాణి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ



గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎంతో ఉపయోగపడే సొసైటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇదివరకు సొసైటీలను నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవమే. ఇందుకు సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యం కావడం ఒక కారణం. కంప్యూటరీకరణ పూర్తయితే రుణాల చెల్లింపుల్లో పారదర్శకత, నిర్వహణలో స్పష్టత వస్తుంది. రుణాల చెల్లింపులు, రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇందుకు బ్యాంకు, సొసైటీల సిబ్బంది సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించాం. కలిసి పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయి. రుణాల చెల్లింపులు, పంట రుణాల రెన్యువల్ వేగవంతం చేయాల్సిన పరిస్థితి. సొసైటీలకు రుణాలతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయమార్గాలను చూపాలి.

రాష్ట్ర ప్రయోజనాల కోసం సహకరిస్తాం

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి


మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర టౌన్, జూలై 2: రాష్ట్రంలో రెండు పార్టీలు కేంద్రానికి మద్దతు ఇస్తున్నాయని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడితే తాము కూడా సహకరిస్తామని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. 2029లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మడకశిరలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు బీజేపీకి లేకపోతే కేంద్రంలో ఏం జరుగుతుందో చెప్పలేమని అన్నారు. వీరి మద్దతుతోనే కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతోందని అన్నారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రస్తుతం రాజ్యాంగాన్ని కాపాడటానికి బలమైన ప్రతిపక్షం ఉందని అన్నారు. ఈనెల 6న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు హైదరాబాద్‌లో సమావేశం కానున్నారని, ఆంధ్రప్రదేశ్ హక్కులను సాధించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇదేమంచి తరుణమని అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు ఆయన శుభకాంక్షలు తెలిపారు. మడకశిరలో ఆగిన రైల్వే లైన్ నిర్మాణం పూర్తి చేయించాలనీ, హంద్రీనీవా కాలువ ద్వారా అన్ని చెరువులకు నీరు నింపాలని వారికి సూచించారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా అందరి గొంతులు తడపాలని, పరిశ్రమల సాధన కోసం కృషి చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఉసురు తీసిన వైసీపీ ప్రభుత్వం


మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జూలై 2: స్వయం ప్రతిపత్తిగల విశ్వవిద్యాలయాల్లో అరాచకశక్తులను జొప్పించిన గత ప్రభుత్వం.. ఐదేళ్లపాటు ఉద్యోగుల ఉసురు తీసుకుందని రాష్ట్ర వర్సిటీల బోధనేతర ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఆవేదనచెందారు. మంగళవారం వారు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను విజయవాడలో కలిసి తమ హక్కుల ను పరిరక్షించాలని కోరినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు కేశవరెడ్డితో కలిసి మంత్రికి సమస్యలు వివరించామని మాజీ అధ్యక్షుడు తిమ్మప్ప పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఊపిరి పీల్చుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వర్సిటీల ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసును 2022 జనవరి 1నుంచే అమలు చేయాలన్నారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగులు నిశ్చింతంగా విధులు నిర్వహించుకోవచ్చునని, అన్ని సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చారని తెలిపారు.

కార్మిక వ్యతిరేకతతోనే వైసీపీ ఓటమి

ఓబుళదేవరచెరువు, జూలై 2: గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులను ఇబ్బంది పెట్టడం వల్లే ఓటమి పాలైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మహమ్మదా బాద్ క్రాస్‌లో విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం మాదిరి ప్రస్తుత అధికార కూటమి ప్రభుత్వం తప్పులు చేయరాదన్నారు. పలు ప్రాంతాల్లో ఆశ, అంగన్ వాడీ, మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులను వైదొలగాలని ఒత్తిళ్లు తేవడం సరైంది కాదన్నారు. సమాన పనికి సమాన వేతనం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులపై పోలీసుల వేధింపులు, చలానాలు రద్దు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు గంగాధర్, వేమన, బాబా, మండలాధ్యకార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఓబులు

చీనీ కాయలు టన్ను రూ.22వేలు

అనంతపురంరూరల్, జూలై2: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 338 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

ప్రవేశాలకు వేళాయె..!

- డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులకు కౌన్సెలింగ్ ప్రారంభం
- డిగ్రీకి ఈనెల 10వరకు, ఇంజనీరింగ్‌కు 7వరకు రిజిస్ట్రేషన్



అనంతపురం సెంట్రల్, జూలై2: ఉన్నత విద్యా కోర్సుల ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకామ్, బీబీఏ, ఒకేషనల్ వంటి కోర్సులతోపాటు ఇంజనీరింగ్‌లో బీటెక్ కోర్సుల ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టింది. ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 1 నుంచి 7వ తేదీవరకు, ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు 10వరకు ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గత ప్రభుత్వం ప్రవేశాల ప్రక్రియను ప్రతిఏటా ఆలస్యంగా చేపట్టింది. దీంతో తరగతుల నిర్వహణ కాలపరిమితి కుదించి పరీక్షలు నిర్వహించేవారు. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల తిరగక ముందే కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టడంపై హర్షం వ్యక్తం అవుతోంది.

ఇంజనీరింగ్‌లో...

జేఎన్‌టీయూ పరిధిలో 120కిపైగా అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. అనంతపురం, పులివెందుల, కలికిరి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలున్నాయి. వీటిలో ప్రవేశాలు పొందేందుకు ఈఏపీసెట్ (ఎంపీసీ స్ట్రీమింగ్)లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల ఏడో తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తిచేసిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అధికారులు పరిశీలిస్తారు. లోపాలుంటే సంబంధిత విద్యార్థుల మొబైల్ నంబర్లకు మెసేజ్‌లు పంపుతారు. 8నుంచి 12 తేదీవరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుంది. ఆప్షన్లు ఇచ్చుకున్న కళాశాలలను 13న మార్పు(స్లైడింగ్) చేసుకునే వెసులు బాటును కల్పించారు. అనంతరం 16న సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో 22లోపు రిపోర్ట్ చేసుకోవాలి. 19నుం చి కళాశాలల తరగతులు ప్రారంభం కానున్నాయి. https://eapcetsche.aptonline.in/EAPCET/ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సమస్యల పరిష్కారాలకోసం జేఎన్‌టీయూ హెల్ప్ లైన్ సెంటర్ 08554-272450, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్ 7901620145 నెంబర్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలలోపు సంప్రదించాలని అధికారులు సూచించారు.

డిగ్రీ ప్రవేశాలకు...

ఎస్కేయూ పరిధిలో 13 ప్రభుత్వ, 74 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో ప్రవేశాలు పొందేందుకు ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల పదో తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున విద్యార్థుల సర్టిఫికెట్లను ఈ నెల ఐదో తేదీ నుంచే పరిశీలిస్తారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు 11నుంచి 15వరకు వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలల ఎంపిక చేసుకోవాలి. ఆప్షన్లు ఇచ్చుకున్న వారికి 19న సీట్లను కేటాయిస్తారు. సీటుపొందిన విద్యార్థులు 20 నుంచి 22వరకు సంబంధిత కళాశాలలో రిపోర్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం తరగతులు ప్రారంభం కానున్నాయి. https://oamdcapsche.aptonline.in/OAMDC202425/Inde వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. వివరాలకు ఆర్ట్స్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్ 8897841984 నెంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి సూచించారు.

ఉచితంగా రిజిస్ట్రేషన్

డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కేటగిరి వారిగా ఓసీ రూ.400, బీసీ రూ.300, ఎస్సీఎస్టీ రూ.200ల చొప్పున ఆన్‌లైన్ ద్వారానే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేట్ ఇంటర్నెట్ సెంటర్లలోకి వెళితే వీటికి అదనంగా ఒక్కక్కరికి దాదాపు రూ.300వరకు వసూలు చేస్తారు. ఈ అదనపు భారంలేకుండా ఆర్ట్స్ కళాశాలలోనే విద్యార్థులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

చెస్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 2: రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విజేతలుగా జిల్లా క్రీడాకారులు నిలిచారు. రెండు రోజులుగా కర్నూలులో నిర్వహించిన 4వ స్పార్క్ చెస్ అకాడమీ ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఉదయ్‌కుమార్ రన్నరప్ టైటిల్ కైవసం చేసుకోగా, ఏ1 చెస్ అకాడమీకి చెందిన నితీష్ నాలుగోస్థానం, శ్రీహ పదోస్థానం, అండర్-7 బాలికల విభాగంలో షేక్‌ఆసీఆలీ ప్రథమ స్థానాన్ని, అండర్-13లో కాశి నౌమిక మొదటి స్థానాన్ని సాధించారు. ఈనెల 12వతేదీ నుంచి విజయవాడలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

బాలికపై అత్యాచారం

ఇద్దరిపై పోక్సో కేసు

పుట్లూరు, జూలై 2: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రవితేజ, నాగేంద్ర అనే ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ హేమాద్రి మంగళవారం తెలిపారు. బాలికను స్వగ్రామం నుంచి నిందితులు ఇద్దరూ సోమవారం బైక్‌పై తాడిపత్రి మార్కెట్‌యార్డుకు తీసుకువెళ్లి.. ఐచర్ వాహనంలోకి ఎక్కించి అత్యాచారం చేశారని అన్నారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, జూలై 2: పెండింగ్‌లోని కోర్టు కేసులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం రెవెన్యూ, లీగల్ అంశాలపై ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కోర్టు కేసులను రోజుకు ఒకటి చొప్పున వెంటనే క్లియర్ చేయాలన్నారు. కంటెంప్ట్ కేసులను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓలు వెంకటేష్, శ్రీనివాసులురెడ్డి, రాణి సుస్మిత, కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేటిలోగా ఎన్నికల లెక్కలు చూపాలి

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయ ఖర్చు తుది అకౌంట్స్ వివరాలను బుధవారంలోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయన అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ షిండే, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్, అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు రాందాస్ కాలేలతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా అభ్యర్థులందరూ ఎన్నికల అంతిమ లెక్కలను డీఈఓకు సమర్పించాలని, లేనిపక్షంలో డిస్ క్వాలిఫై అవుతారన్నారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, పర్యాటక శాఖ ఆర్‌డీ వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల ఖర్చు మానిటరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్‌లో 946 మంది ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూలై 2: ఏపీ ఓపెన్ స్కూల్-2024 పరీక్షల్లో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో 1337 మందిలో 946 మంది ఉత్తీర్ణులైనట్టు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్‌నాయక్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో 409 మందిలో 291 మంది ఉత్తీర్ణులు కాగా 71.15 శాతం ఉత్తీర్ణత వచ్చిందని, ఇంటర్‌లో 928 మందిలో 655 మంది పాస్ కాగా 70.58 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. అనంతపురం జిల్లాకు రాష్ట్రంలో 13వ స్థానం దక్కిందని తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు అభ్యర్థులు రూ. 200, రీ వెరిఫికేషన్ కోసం రూ.1000 చెల్లించాల్సి ఉందన్నారు. ఈనెల 13వ తేదీ వరకూ ఫీజును మీసేవ లేదా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో లేదా ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్ వెబ్‌సైట్‌లో ఇచ్చిన గేట్ వే లింకు ద్వారానే చెల్లించాలన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ జేడీ బదిలీ?

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 2: ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావును బదిలీ చేస్తూ ఆశాఖ రాష్ట్ర అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఇదివరకు ఆయన రాష్ట్ర కార్యాలయంలోని స్కాలర్‌షిప్ విభాగంలో విశిష్ట సేవలు అందించారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో స్కాలర్‌షిప్‌లను జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పేరిట బ్యాంకు ఖాతాల్లోకి జమచేయడంతో ఆ విభాగం ఖాళీ అయినట్లయింది. స్కాలర్‌షిప్పులను గతంలో మాదిరిగానే అమలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జేడీ మధుసూదన్‌రావుకు తిరిగి స్కాలర్‌షిప్పుల విభాగానికి రావాలంటూ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఆయనను రాష్ట్రశాఖలోని స్కాలర్‌షిప్‌ల విభాగానికి బదిలీ చేసినట్లు ఆశాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు నేడో.. రేపో.. వెలువడనున్నట్లు తెలిసింది.

సచివాలయ ఉద్యోగి సంకల్పం

82 కిలోమీటర్లు ప్రయాణించి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న సరోజ

పుట్టపర్తిరూరల్, జూలై 2: ఓ సచివాలయ ఉద్యోగి 82 కిలోమీటర్లు ప్రయాణించి.. నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలికి పింఛన్ అందజేసి.. తన ఉదారతను చాటుకుంది. అనంతపురం విజయనగర్ కాలనీకి చెందిన వెంకట సుబ్బమ్మ (80) ప్రస్తుతం పుట్టపర్తిలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. ప్రస్తుతం ఆమె నడవలేని స్థితిలో ఉంది. దీంతో ఆమె అనంతపురానికి వచ్చి.. పింఛన్ అందుకోలేక పోయింది. విషయం తెలుసుకున్న విజయనగర్ కాలనీ సచివాలయ ఉద్యోగి వెల్ఫేర్ సెక్రటరీ సరోజ అనంతపురం నుంచి పుట్టపర్తికి మంగళవారం వచ్చింది. ఆ వృద్ధురాలికి రూ.ఏడువేల పింఛన్ అందజేసింది. దీంతో ఆమెను పలువురు అభినందించారు.

విద్యార్థులకు కేఎస్ఆర్టీసీ డ్రైవర్ ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదు అందిస్తున్న వెంకటరమణ

కదిరి, (అమడగూరు), జూలై 2: అమడగూరుకు చెందిన వెంకటరమణ కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన కుమార్తె పావని జ్ఞాపకార్థం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24కు చెందిన టెన్త్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలను మంగళవారం అందించారు. ఎం. చందు (590) రూ.5వేలు, ఆశ (580) రూ.నాలుగు వేలు, రితిక (569) రూ.మూడు వేలు, ఇందు (527) రూ.రెండు వేలు, సోహెల్‌ఖాన్, శృతి (512) ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున అందించారు. మండలంలోని గాజులపల్లి వద్ద ఉన్న మాతృశ్రీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈయనతోపాటు ఈ వృద్ధాశ్రమానికి సర్వేయర్ సురేంద్ర రూ ఐదువేల విలువైన నిత్యవసర వస్తువులను ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి అందించారు.

చెరువులో అక్రమ బోర్లు



చెరువులో అక్రమంగా వేసిన బోరు

కదిరి, జూలై 2: తలుపుల మండలం కుర్లి పంచాయతీ పరిధి వండ్లబండచెరువులో వైసీపీ చెందిన ఓ నాయకుడు అక్రమంగా నాలుగు బోర్లు వేయించుకున్నాడని, వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరువులోనే భూమిని అక్రమించి పంటలు సాగుచేస్తున్నాడని, నాలుగు బోర్లు చెరువులో వేయడంతో చెరువులో నీరు క్రమంగా అడుగట్టిపోయాయని వాపోతున్నారు. ప్రస్తుతం పశువులు తాగడానికి నీరు కరువైందన్నారు. చెరువులో అక్రమంగా బోర్లు వేసినా పంచాయతీ, వ్యవసాయ అధికారులు ఇంతవరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

కొత్తచెరువు, జూలై 2: మండలంలోని కేశాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న చిన్నబోయనపల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులకు సైకిళ్లను మంగళవారం అందజేసినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం రియాజ్‌బాషా తెలిపారు. తిరుమల దేవరపల్లి పాఠశాల హెచ్‌ఎం కోలేటి ప్రసాద్, సాయిబాబా భక్తుల సహకారంతో ఈ సైకిళ్లను పంపిణీ చేశారన్నారు. చిన్నబోయనపల్లికు చెందిన విద్యార్థులు ప్రతిరోజు ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వచ్చేవారు. ఈ సమస్యను ఉపాధ్యాయుడు ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఈ సైకిళ్లను అందించారన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సాయిబాబా భక్తులకు, ఉపాధ్యాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

కదిరి లీగల్, జూలై 2: కదిరిలో న్యాయవాదిపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డీఎస్పీ శ్రీలతను న్యాయవాదుల సంఘం కోరింది. పలువురు న్యాయవాదులు మంగళవారం డీఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... దాడి జరిగి వారం రోజులు గడిచినా ఇంతవరకు నిందితుడిని అరెస్ట్ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దాడిని నిరసిస్తూ కదిరిలోనేకాక జిల్లావ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసనలు తెలుపుతున్నారన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కూటమి నాయకులు

పుట్టపర్తి, జూలై 2 : పట్టణంలోని మునిసిపల్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బొగ్గరం శ్రీనివాసులు, టీడీపీ మునిసిపల్ కౌన్సిలర్ రత్నప్ప చౌదరి మునిసిపల్ కమిషనర్ అంజయ్యకు వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మీడియతో మాట్లాడుతూ.. పుట్టపర్తిలో అత్యంత విలువైన మునిసిపాలిటీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. అదేవిధంగా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, పారిశుధ్యం లోపించిందని ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన కమిషనర్.. సంబంధిత సిబ్బందిని క్షేత్రస్థాయిలో పర్యటించి మునిసిపాలిటి భూములను ఆక్రమించిన వారికి నోటీసులు జారీచేయాలని సిబ్బందిని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో జనసేన టౌన్ ఉపాధ్యక్షులు మారుతి, టౌన్ ప్రధాన కార్యదర్శి రాము కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

పగలే చోరీ

గోరంట్ల, జూలై 2: పట్టణంలోని మండల కాంప్లెక్సు సమీపంలో నివాస గృహంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. మోహన్‌రెడ్డి, నర్మదా ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో పాఠశాలలకు వెళ్లారు. ఇంటికి తాళం వేయగా వెనుకల తలుపుల గుండా గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, అల్మారాలోని దుస్తులను చెల్లాచెదురు చేసి, అందులో దాచి ఉంచిన రూ. 60వేల నగదును చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు.

దశ తిరిగేనా..!

- ధర్మవరం వందపడకల ఆసుపత్రిలో సౌకర్యాలు కరువు
- ఒక స్ట్రెచర్, రెండు వీల్‌చైర్లు మాత్రమే..
- ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్సలు
- అందుబాటులో లేని ఎంఆర్ఐ, సీటీ స్కాన్, వెంటిలేటర్
- పెచ్చులూడుతున్న భవనం
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- ఆశలన్నీ ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌పైనే..



ధర్మవరం పెద్దాసుపత్రి

ధర్మవరంరూరల్, జూలై 2: ధర్మవరంలోని వందపడకల ఆసుపత్రిలో సమస్యలు తిష్టవేశాయి. ఆసుపత్రిలోకి అడుగు పెట్టిన మొదలు కంకర తేలిన రహదారి దర్శనమిస్తుంది. ఆ రహదారిలో రోగులు నడవలేక తీవ్ర యాతన పడుతుంటారు. ఆసుపత్రికి రోజుకు వందలాది మంది ఓపీకి వస్తుంటారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఆసుపత్రికి వస్తుంటారు. ఈ వందపడకల ఆసుపత్రికి ఉన్నది ఒకటే స్ట్రెచర్.. ఒకే వీల్ చైర్. ఆసుపత్రికి చాలా మంది రోగులు వస్తుండటంతో అవి ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో రోగులను వారి కుటుంబసభ్యులు, బంధువులే ఆస్పత్రిలోకి తీసుకొస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధుల పరిస్థితి మరీ దయనీయం. ప్రభుత్వం మారడం... అందులోనూ ఆరోగ్యమంత్రిగా నిజయోజకవర్గ ఎమ్మెల్యే సత్యకుమార్‌యాదవ్ కావడంతో ప్రజలందరూ ఆయనపైనే ఆశలు పెట్టుకున్నారు. ఆసుపత్రి రూపురేఖలు మార్చాలని వేడుకొంటున్నారు.

అసౌకర్యాలకు నిలయం..

ధర్మవరం ప్రభుత్వాసుపత్రి వందపడకల ఆసుపత్రి. డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు సంబంధించి దాదాపు రోజుకు 800 మంది రోగులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. ఈ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పలువురు రోగులను ఇక్కడి వైద్యులు అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేస్తుంటారు. ఆసుపత్రిలో ప్రస్తుతం అల్ట్రా స్కానింగ్, ఎక్స్‌రే మాత్రమే ఉన్నాయి. ఆసుపత్రిలో ఎంఆర్ఐ, సీటీస్కాన్, వెంటిలేటర్ తదితర సౌకర్యాలు లేవు. దీంతో ఈ ఆస్పత్రి కేవలం చిన్నచిన్న జబ్బుల వారికే వైద్య సేవలు అందించేందుకు పరిమితమైంది. ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్యసేవలు అందించే దుస్థితి ఉంది. ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పెచ్చులూడి పడటంతో రోగులు గాయపడ్డ సంఘటనలు అనేకం. దీంతో సిబ్బంది సైతం బిక్కు బిక్కు మంటూ వైద్య సేవలు అందించే పరిస్థితి ఉంది.

సిబ్బంది కొరత

వంద పడకల ఆసుపత్రిలో ప్రస్తుతం 12 మంది వైద్యులు ఉన్నారు. ఇంకా తొమ్మిది మంది డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. జనరల్ మెడిసన్ డాక్టర్, స్కానింగ్ రేడియోలజిస్టు, ఆర్థోపెడిక్ డాక్టర్, కంటి డాక్టర్, చర్మవ్యాధుల డాక్టర్ లేరు. డెంటల్ డాక్టర్ కూడా వారానికి మూడు రోజులు ఈ ఆసుపత్రిలో, మిగతా మూడు రోజులు బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బలో విధులు నిర్వహిస్తున్నారు.

ఆశలన్నీ మంత్రిపైనే..

ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకోవడంతో ధర్మవరం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక మన ఆసుపత్రిలోని సమస్యలన్నీ పరిష్కరించి.. మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సొంత నియోజకవర్గం కావడంతో మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆసుపత్రిలోని మెరుగైన సౌకర్యాలు కల్పించి.. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్తాం

ఆసుపత్రిలో పలు వైద్యపోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలూ లేవు. వాటిని మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్తాం. వైద్యులు పోస్టుల భర్తీ చేసి.. ఆసుపత్రి అభివృద్ధి చేసి.. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం.

మాధవి, ఆస్పత్రి సూపరింటెండెంట్, ధర్మవరం



వీల్‌చైర్లు లేక పాట్లు



ఆసుపత్రి ఎదుట కంకర తేలిన రోడ్డు



పెచ్చులూడిన భవనం



ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్స

బుక్కపట్నం డైట్‌లో ఘనంగా ఫేర్‌వెల్ డే

బుక్కపట్నం జూలై 2: స్థానిక జిల్లా విద్యాసంస్థ (డైట్)లో మంగళవారం 2022-24 ఛాత్రోపాధ్యాయులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ రవిసాగర్ మాట్లాడుతూ.. కోర్సు పూర్తి చేసిన ఛాత్రోపాధ్యాయులు ఉన్నతస్థాయికి చేరుకుని భావి ఉపాధ్యాయులుగా సేవలందించి ఉత్తమ విద్యార్థులను తయారు చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అధ్యాపకులతో గత స్మృతులు గుర్తు చేసుకున్నారు. అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 2024-26 నూతన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీఈటీ రామక్రిష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

టీచర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రికి ఆపస్ నాయకుల సన్మానం

అనంతపురం విద్య, జులై 2: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నాయకులు వైద్యశాఖ మంత్రి సత్యకుమా ర్‌ను కోరారు. మంగళవారం ధర్మవరంలో ఆ సంఘం నాయకులు మంత్రిని కలిశారు. నాయకులు మాట్లాడుతూ.... 2003-డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పాఠశాల విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో 117 రద్దు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్స్‌ను పరిష్కరించాలన్నారు. 3,4,5 క్లాసులను ఉన్నత పాఠశాలల నుంచి విలీనాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌లో ఉన్న ఇబ్బందులను తొలగించి, అన్ని కేడర్ల టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ప్రతి ప్రైమరీ స్కూల్‌లో ఇద్దరు టీచర్లు ఉండేలా చూడాలన్నారు. భాషా పండితులకు పీఈటీలుగా ఉద్యోగోన్నతులు కల్పించాల న్నారు. తల్లికి వందనం కార్యక్రమం ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని కోరారు. టీచర్లపై అనవసరమైన యాప్స్ భారం మోపకుండా చూడాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సలహాదారుడు వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్రకార్యదర్శి రాజేంద్రప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, కోశాధికారి రాఘవేంద్ర గుప్తా, ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్ పాల్గొన్నారు.

బాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



బుక్కపట్నం, జూలై 2: స్థానిక తేరు సర్కిల్‌లో ఫెరాలసిస్ ఫించన్‌దారుడు సూరి ఆధ్వర్యంలో దివ్యాంగులు, పింఛన్‌దారులు, టీడీపీ, జనసేన నాయకులతో కలిసి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు.

కేజీబీవీలో సమస్యల తిష్ట

● నిబంధనలకు నీళ్లు ● ఆధిపత్య పోరు ● సంతకాలకే పరిమితమైన ఇన్‌చార్జి



ఎన్పీకుంట కేజీబీవీ

నంబులపూలకుంట, జూలై 2: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ)లో సమస్యలు తిష్టవేశాయి. ఒక్కో తరగతిలో 40 మంది బాలికలు ఉన్నారు. గత వైసీపీ పాలనలో ఇంటర్ మీడియట్‌ను కూడా ఈ పాఠశాలకు అనుసంధానం చేశారు. విద్యాబోధనకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేరు. ఈ పాఠశాలలో పనిచేసే ఎస్‌ఓ పాఠశాల పునఃప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకూ కేవలం రెండుసార్లు మాత్రమే పాఠశాలకు హాజరయారంటే.. ఆమె విధుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఇట్టే అర్థమవుతుంది.

నిబంధనలకు నీళ్లు

కస్తూర్బా గురుకుల పాఠశాలలో బాలికలకు మెనూ మేరకు భోజనం ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన ఎస్‌ఓ తన విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని తరగతుల్లో ఖాళీలు ఉన్నాయి. దీంతో కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు సిఫార్సులతో దరఖాస్తులు వచ్చినా, తీసుకునేవారు లేరు. దీంతో ఆ తల్లిదండ్రులు పాఠశాలల చుట్టూ రోజూ తిరుగుతు న్నారు. పాఠశాలలో భోజనం కూడా నాణ్యతగా లేదనే ఆరోపణలున్నాయి. కనీసం ఈ బాలికలకు ఏలాంటి ఆహారం అందిస్తున్నారో చూసే నాథుడే కరువయ్యారు.

185 మందికి ఒకే వంట మనిషి

ఈ పాఠశాలలో 185 మంది బాలికలున్నారు. వీరికి నలుగురు వంటమనుషులు విధులు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గత యేడాది వరకు నాలుగురు వంట మనుషులుండేవారు. వీరిలో ముగ్గురు రెగ్యులర్, ఒక గెస్టుగా కొనసాగేవారు. గత యేడాదిలో రెగ్యులర్‌లో ఒకరు బదిలపై వెళ్లిపోగా, వారి స్థానంలో గెస్టుగా ఒకరిని తీసుకున్నారు. అయితే ఈ పాఠశాల పునఃప్రారంభం నుంచి ఇప్పటివరకు హాజరుకాలేదు. మరొకరు పాఠశాలలో విధుల నిర్వహిస్తూ జారి పడడంతో మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మరొకరు పాఠశాల వంటగది సమీపంలో విషపురుగు కరవడంతో ఆమె కూడా విధులకు దూరంగా ఉన్నారు. దీంతో ఉన్న ఒక్క వంట మనిషే కూరగాయాలు తెచ్చుకోవడం.. సామాన్లు శుభ్రం చేసుకోవడం.. స్టోర్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకోవడం.. వంట చేయడం.. పిల్లలకు భోజనం వడ్డించడం.. చేస్తోంది.

ఆధిపత్య పోరు

ఈ పాఠశాలలో ఎస్‌ఓకు, ఉపాధ్యాయులకు మధ్య కొన్ని సంవత్సరాలుగా ఆధిపత్య పోరు సాగుతోంది. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఓఎస్‌ఓ బదిలీపై చిలమత్తూరుకు వెళ్లగా, అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఓను ఇక్కడికి బదిలీ చేశారు. అయినా ఆమె చిలమత్తూరులో ఉంటూ ఎన్పీకుంట వచ్చి విధులు నిర్వహిస్తోంది. ఆమె రోజూ విధులకు రావడం లేదని, వచ్చినా సమయ పాలన పాటించడం లేదని, విధులకు చుట్టం చూపుగా వచ్చివెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఓఎస్‌ఓ, సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ఎవరికి వారు వ్యవహరిస్తుండటంతో నిర్వహణ గాడితప్పి.. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులూ కస్తూరిబా పాఠశాలను ఎప్పుడూ తనిఖీ చేయకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆటగా... పాడిందే పాటగా సాగుతోందని విద్యార్థ తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

సిబ్బందిని నియమిస్తాం

పాఠశాలకు ఒక స్వీపర్, ఇద్ద వంటమనుషులు, ఒక వ్యాచ్‌మన్, ఒక అటెండర్, ఒక అకౌంటెట్, ఒక ఎఎన్‌ఎంను భర్తీచేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తూనే వారిని నియమిస్తామన్నారు. గెస్టులు ఎవరూ విధుల్లో లేరు.

- రిహానా, ఎస్‌ఓ, కేజీబీవీ

నేడు జాబ్‌మేళా

ముదిగుబ్బ,జూలై 2: స్థానిక ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రకాష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ చదువుతున్నా, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఇబ్రహీం పట్నం ఐటీఐ కళాశాలలో మారుతి సుజుకి (అరెనా) కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఈ జాబ్ మేళాను వినియోగించుకోవాలని తెలిపారు.

చెట్లు నాటేలా చర్యలు తీసుకోండి

కొత్తచెరువు, జూలై 2: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆవరణంలో విద్యార్థులతో మొక్కలు నాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబుకు పర్యావరణ వేత్త భాస్కర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు జ్యోతిప్రసాద్, లాయర్ హరిప్రసాద్, సురేంద్ర బాబు ఉన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి

ధర్మవరం, జూలై 2: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు మరింత కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కౌన్సిల్ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ... వార్డుల్లో రజకులకు దోబీఘాట్ ఏర్పాటు చేయాలని, డీవైండర్ల మధ్య మొక్కలు నాటాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు శంషాద్‌బేగం, జయరామిరెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

కదిరిఅర్బన్, జూలై 2: నీట్ పరీక్షను కేంద్రం రద్దు చేయాలని, పరీక్ష లీకులకు కారణమైన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలనే డిమాండ్‌తో గురువారం విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్ఎ, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. మంగళవారం వాటికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేసిన వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించి.. విజయవంతం చేయాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శేషాద్రి (ఫైల్)

కదిరి, జూలై 2: తలుపుల మండలంలోని పల్లెవాండ్లపల్లి సమీపంలో ఐచర్ ఢీకొని కదిరి నిజాంవలీ కాలనీకి చెందిన శేషాద్రి (30) మరణించాడు. ఇతను ఓ ప్రైవేటు కంపెనీ ఉద్యోగి. కంపెనీ పని నిమిత్తమై బైక్‌లో తలుపుల మండలానికి మంగళవారం వెళ్లాడు. పని పూర్తి చేసుకుని ఓబులరెడ్డిపల్లి నుంచి తలుపు లకు వస్తుండగా.. తలుపుల నుంచి ఓబుళరెడ్డిపల్లి వెళ్తున్న ఐచర్ పల్లెవాండ్లపల్లి సమీపంలో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శేషాద్రిని స్థానికులు ట్రాక్టర్‌లో తలుపులోని ఓ ప్రైవేటు డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. కాగా అప్పటికే అతను మరణించినట్లు ఆ వైద్యుడు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడు అవివాహితుడు. తల్లిదండ్రులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్ తెలిపారు.

భార్యపై దాడి

నంబులపూలకుంట, జూలై 2: మండలంలోని ఎగువతూపల్లికి చెందిన మల్లిరెడ్డి తన భార్య రాజేశ్వరీపై రోకలి బండతో దాడి చేశాడు. ఈ దంపతులు కొద్ది రోజులుగా ఘర్షణ పడుతున్నారు. ఇటీవల పెద్ద మనుషులు కూడా వారికి సర్దిచెప్పారు. మంగళవారం తెల్లవారుజామున కొడుకు, కోడలు ఇంట్లో లేని సమయంలో మల్లిరెడ్డి రాజేశ్వరీ తలపై రోకలి బండతో బాది పరారయ్యాడు. కొద్దిసేపటికి ఇంటికొచ్చిన కొడుకు, కోడలు రాజేశ్వరీ రక్తపు మడుగులో పండి ఉండడాన్ని చూసి.. వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పింఛన్ల పంపిణీ

ధర్మవరం, జూలై 2: పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలోని 25వ వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, ఆ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల, జూలై 2: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారని తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీపీ, పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

బహిరంగ వేలం వాయిదా

హిందూపురం(సోమందేపల్లి), జూలై 2: మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలో మంగళవారం నిర్వహించదలచిన బహిరంగ వేలంపాట వాయిదా పడింది. వేలంపాటకు ఏర్పాట్లు పూర్తిచేసిన తర్వాత డిపాజిట్లు అధికంగా ఉన్నాయని పాటదారులు వేలం పాటను బహిష్కరించారు. వారపుసంత, బస్టాండ్‌కు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అధికంగా ఉన్నాయని వారు ఆరోపించారు. దీంతో అది వాయిదా పడినట్లు కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. సర్పంచ్ గంగాదేవి, ఇన్‌చార్జి ఈఓఆర్డీ శ్రీధర్ పాల్గొన్నారు.

పగలే చోరీ

గోరంట్ల, జూలై 2: పట్టణంలోని మండల కాంప్లెక్సు సమీపంలో నివాస గృహంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మోహన్‌రెడ్డి, నర్మదా ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో పాఠశాలలకు వెళ్లారు. ఇంటికి తాళం వేయగా వెనుకల తలుపుల గుండా గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, అల్మారాలోని దుస్తులను చెల్లాచెదురు చేసి, అందులో దాచి ఉంచిన రూ. 60వేల నగదును చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. పోలీస్‌కు ఫిర్యాదు చేయగా, సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ

అగళి, జూలై 2 : మండలంలోని మధుడి, ఇనగలూరు, అగళి ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు బూట్లు, సాక్సులు పంపిణీ చేసినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. మండలవ్యాప్తంగా 3,085మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 6వ తరగతి విద్యార్థులకు డైరీలు కూడా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఎంఈఓ వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మాదవ్, వరదరాజు, దాసేగౌడ్‌లు ఉన్నారు.

పశువులను కబలిస్తున్న వ్యాధులు

● పలు మండలాల్లో ఆవులు, దూడలు మృత్యువాత ● పాడి రైతుల్లో పెరిగిన ఆందోళన

హిందూపురం(సోమందేపల్లి), జూలై 2: వింతవ్యాధితో మూగజీవాలు మృత్యువాత పడుతుండడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని తుంగోడు పంచాయతీ కొలిమిపల్లిలో రైతు రామాంజినప్పకు చెందిన పాడిఆవు, రెండు దూడలు మంగళవారం మృతి చెందాయి. బాధితుడి కథనం మేరకు ఉదయం పశువులకు మేత వేయడానికి వెళ్లి చూడగా అప్పటికే అవి మృతి చెందాయన్నారు. అలాగే గత పది రోజుల క్రితం వెలిదడకల పంచాయతీ పత్తికుంటపల్లి గ్రామంలో రైతు గట్టు చిన్న నరసింహులుకు చెందిన రెండు ఆవులు, భాస్కర్‌రెడ్డికి చెందిన రెండు ఆవులు కూడా ఇదే రకంగా మృతి చెందాయి. అయితే మూగజీవాలు ఇలా ఎందుకు మృత్యువాత పడుతున్నాయని రైతుల్లో ఆందోళన నెలకొంది. వింత వ్యాధి మండలంలోని గ్రామాల్లో చాపకింద నీరులా ప్రబలుతోందని రైతులు వాపోతున్నారు. తమ జీవనాధారమైన పశువులను కోల్పోయి జీవనాధారం కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, పాలకులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. సమాచారం అందుకున్న పశు వైద్య సిబ్బంది హుటాహుటిన కొలింపల్లి గ్రామానికి చేరుకున్నారు. మృతి చెందిన పశువులను పరిశీలించారు. గ్రామంలో కలియదిరిగారు. పాడి రైతులతో మాట్లాడి వ్యాధి తీవ్రతపై ఆరాతీస్తున్నారు. మృతి చెందిన పశువులనుంచి సేకరించిన రక్తాన్ని ల్యాబ్‌కు పంపించినట్లు వైద్యులు బాలాజీ తెలిపారు. రిపోర్ట్ ఆధారంగా వ్యాధిని గుర్తించి వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



వింత వ్యాధితో మృతిచెందిన పాడిఆవులు

గొరక వ్యాధి ప్రబలుతోంది : డీడీ

మండల పరిధిలోనిని పత్తికుంటపల్లి గ్రామంలో మంగళవారం వింత వ్యాధి సోకి ఆవు, రెండు దూడలు మృతిచెందగా గ్రామంలో పశువైద్య బృందం పర్యటించింది. మృతి చెందిన పశువులను పరీక్షించిన తర్వాత పాడిరైతులను కలిసి వ్యాధి లక్షణాలపై వివరాలు సేకరించారు. ఈ దిశలో డీడీ పెంచలయ్య మాట్లాడుతూ పశువుల్లో గొరుక వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించమన్నారు. గ్రామంలో పశువులన్నింటికీ వ్యాక్సినేషన్ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పశువులలో గొరుక వ్యాధి లక్షణాలు కనిపిస్తే స్థానిక వైద్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గోరంట్ల ఏడీ శ్రీనివాసులు, వైద్యులు బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.



మృతిచెందిన ఆవులను పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

ఆస్పత్రులకు వెళ్లి.. పింఛన్

● బాధితులకు స్వయంగా అందజేసిన సిబ్బంది



అనంతపురంలో పింఛన్ ఇస్తున్న ఏఎన్‌ఎం చిన్నమ్మ



శివప్పకు పింఛన్ అందజేస్తున్న కార్యదర్శి గంగాధర్‌నాయక్

గోరంట్ల, జూలై 2: పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది ఎందరికో ఆదర్శంగా నిలిచారు. తొలిరోజుల పింఛన్ల పంపిణీ పండుగలా సాగిన సంగతి తెలిసిందే. కొంతమంది వృద్ధులు, రోగులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండడంతో వారి ఖర్చులకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతో వారి వద్దకే వెళ్లి మంగళవారం పింఛన్ అందజేశారు. గోరంట్ల మండలంలో కొంతమంది పింఛన్ దారులు అనారోగ్యం రీత్యా సుదూర ప్రాంతాల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నా అక్కడికెళ్లి సిబ్బంది పింఛన్ పంపిణీ చేశారని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కమ్మవారిపల్లికి చెందిన బత్తల రామక్రిష్ణారెడ్డి అనంతపురంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఏఎన్‌ఎం చిన్నచిన్నమ్మ అక్కడికెళ్లి పింఛన్ అందజేశారు. బూదిలి గ్రామానికి చెందిన కొత్తచెరువు శివప్ప బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌నాయక్ వెళ్లి పింఛన్ అందించారు. అత్యవసర సమయంలో వారికి ఉపయోగపడేలా సిబ్బంది స్పందించినందుకు వారిని ఎంపీడీఓ అభినందించారు. గోరంట్ల మండలంలో 11,579 పింఛన్లకుగాను ఇప్పటివరకు 11,483 పంపిణీ చేసి, 99.17 శాతం పంపిణీ పూర్తి అయిందని, కేవలం 96మందికి ఇవ్వాల్సి ఉందని ఎంపీడీఓ తెలిపారు.

రెండు రోజుల్లో 99 శాతం పంపిణీ పూర్తి

మడకశిర రూరల్ : వృద్ధులకు, దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పండుగ సోమవారం ఘనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీని నాలుగైదు రోజులు పాటు చేపట్టేది. అయితే టీడీపీ ప్రభుత్వం రెండు రోజుల్లోనే పింఛన్ల పంపిణీ పూర్తి చేసి అందరి మన్ననలు పొందుతోంది. వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ జరపలేమని, గత వైసీపీ ప్రభుత్వం అనేక దుష్ప్రచారాలు చేసిందని వారు లేకపోయినా టీడీపీ ప్రభుత్వం సకాలంలో పింఛన్ అందించారని వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 18 సచివాలయాల పరిధిలో 9018 మందికి రూ.6.18 కోట్ల పింఛన్ సొమ్ము విడుదలయ్యింది. సచివాలయ ఉద్యోగులు రెండురోజుల్లో 8,863 మందికి పింఛన్ పంపిణీ చేశారు. దీంతో 99 శాతం పూర్తిఅయినట్లు పారిపలనాధికారి ఆరాధ్య తెలిపారు. మిగిలిన 155 మందిలో మృతి చెందిన వారు, గ్రామాల్లో నివాసం లేని వారు ఉన్నారన్నారు.

అనంతపురం ఆస్పత్రికి వెళ్లి..

హిందూపురం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించే కార్యక్రమం ఘనంగా నిర్వహించింది. అయితే హిందూపురం 37వ వార్డు ముద్దిరెడ్డిపల్లికి చెందిన నాగమ్మ అనే వృద్ధురాలు అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రిలో గుండె సంబంధిత చికిత్స పొందుతోంది. దీంతో వార్డు అడ్మిన్ అశ్వర్థ సొంత ఖర్చులతో ద్విచక్రవాహనంలో అనంతపురంకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేశారు. అడ్మిన్ అశ్వర్థను పలువురు అభినందించారు.



సవేరా ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న అడ్మిన్ అశ్వత్థ

8,337 మందికి పింఛన్ల పంపిణీ

గుడిబండ: మండలంలోని వితంతు, వృద్ధులు, వికలాంగులు, తప్పెట్లు కళాకారులకు 8,337మందికి గాను రూ.5,65,36,000 నగదును సోమ, మంగళవారాలు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ బంగారమ్మ తెలిపారు. పింఛన్ లబ్ధిదారులకు ఇంటింటా వెళ్లి తమ సిబ్బందితో వెళ్లి పంపిణీ చేసినట్లు తెలిపారు.

కస్తూర్బాలో సమస్యల తిష్ట

నిబంధనలకు నీళ్లు ● ఆధిపత్య పోరు ● సంతకాలకే పరిమితమైన ఇన్‌చార్జి

నంబులపూలకుంట, జూలై 2: కస్తూరి గురు కుల పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. ఒక్కొక్క తరగతిలో 40 మంది బాలికలు ఉన్నారు. గత వైసీపీ పాలనలో ఇంటర్ మీడియట్‌ను కూడా ఈ పాఠశాలకు అనుసంధానం చేశారు. అయితే విద్యాబోధనకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేరు. ఈ పాఠశాలలో పనిచేసే ఎస్‌ఓ పాఠశాల పునఃప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకూ కేవలం రెండుసార్లు మాత్రమే పాఠశాలకు హాజరయారంటే.. ఆమె విధుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా ఇట్టే అర్థమవుతుంది.

నిబంధనలకు నీళ్లు

కస్తూర్బా గురుకుల పాఠశాలలో బాలికలకు మెనూ మేరకు భోజనం ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన ఎస్‌ఓ తన విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని తరగతుల్లో ఖాళీలు ఉన్నాయి. దీంతో కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు సిఫార్సులతో దరఖాస్తులు వచ్చినా, తీసుకునేవారు లేరు. దీంతో ఆ తల్లిదండ్రులు పాఠశాలల చుట్టూ రోజూ తిరుగుతు న్నారు. పాఠశాలలో భోజనం కూడా నాణ్యతగా లేదనే ఆరోపణలున్నాయి. కనీసం ఈ బాలికలకు ఏలాంటి ఆహారం అందిస్తున్నారో చూసే నాథుడే కరువయ్యారు.

185 మందికి ఒకే వంట మనిషి

ఈ పాఠశాలలో 185 మంది బాలికలున్నారు. వీరికి నలుగురు వంటమనుషులు విధులు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గత యేడాది వరకు నాలుగురు వంట మనుషులుండేవారు. వీరిలో ముగ్గురు రెగ్యులర్, ఒకరు గెస్టుగా కొనసాగేవారు. గత యేడాదిలో రెగ్యులర్‌లో ఒకరు బదిలపై వెళ్లిపోగా, వారి స్థానంలో గెస్టుగా ఒకరిని తీసుకున్నారు. అయితే ఈ పాఠశాల పునఃప్రారంభం నుంచి ఇప్పటి వరకు హాజరుకాలేదు. మరొకరు పాఠశాలలో విధుల నిర్వహిస్తూ జారి పడడంతో మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మరొకరు పాఠశాల వంటగది సమీపంలో విషపురుగు కరవడంతో ఆమె కూడా విధులకు దూరంగా ఉన్నారు. ఉన్నతాధికారులూ కస్తూరిబా పాఠశాలను ఎప్పుడూ తనిఖీ చేయకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆటగా... పాడిందే పాటగా సాగుతోందని విద్యార్థ తల్లిదండ్రులు మండిపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హిందువులను కించపరచడం తగదు

● రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకుల ఆగ్రహం ● దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హిందూపురం, జూలై 2 : పార్లమెంట్‌లో హిందువులపట్ల రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు భగ్గుమన్నారు. నిరసనగా మంగళవారం హిందూపురంలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో దిష్టిబొమ్మ దహనం చేసి రాహుల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ హిందువుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తక్షణమే క్షమాపణ చెప్పి ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. లేదంటే దేశ వ్యాప్తంగా నిరసనలకు బీజేపీ వెనుకాడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌దేవేంద్ర, అంజినరెడ్డి, సునీల్, శ్రీనివాసులు, జైకృష్ణ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

తోడేస్తున్నారు..

● పురంలో రెచ్చిపోతున్న డీజిల్ దొంగలు ● లారీలు, బస్సులనూ వదలరు.. ● బెంబేలెత్తుతున్న వాహనదారులు

హిందూపురం, జూలై 2 : పట్టణంలో డీజిల్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఎక్కడైనా లారీలు, బస్సులు ఆపితే చాలు చోరులు తమ ప్రతాపం చూపుతున్నారు. ఆపి ఉన్న లారీలు, బస్సుల్లో డీజిల్ దొంగిలిస్తున్నట్లు వాహన యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత పదిరోజుల నుంచి రాత్రిపూట పార్కింగ్ చేసిన లారీలు, బస్సుల నుంచి డీజిల్‌ను తోడేసుకుంటున్నారు. శ్రీకంఠపురం సర్కిల్ సమీపంలో ఆపి ఉన్న లారీల నుంచి రాత్రిపూట డీజిల్‌ను చోరీచేసి ఎత్తుకెళ్తున్నారు. అదేవిధంగా ఎంజీఎం పాఠశాల సమీపంలో ఆగిఉన్న లారీల్లో కూడా ఇదే పరిస్థితే. నాలుగు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఆపి ఉన్న టెంపో నుంచి కూడా డీజిల్‌ను చోరీ చేశారు. దీంతో లారీలు, బస్సుల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధం అవుతున్నారు. ఇటీవల హిందూపురం పట్టణంలో చిల్లర దొంగతనాలు అధికమయ్యాయి. రాత్రిపూట గస్తీ తగ్గడంతో చోరీలు పెరిగినట్లు పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ పెంచి ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.






ర్యాలీగా బయల్దేరుతున్న ఆశావర్కర్లు

అతిసారపై అవగాహన కల్పించండి..

పెనుకొండ, జూలై 2: ఐదేళ్లలోపు పిల్లలున్న తల్లులకు అతిసారంపై (స్టాప్ డయేరియా)పై అవగాహన కల్పించాలని డా.సాయి సౌమ్య ఆశ వర్కర్లకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసారంపై ఆశ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. సాయి సౌమ్య మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 2వరకు ఆశ కార్యకర్తలు ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు పిల్లలున్న తల్లుల ఇంటికి వెళ్లి అతిసారం వారికి అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలన్నారు. ఈ అవగాహన కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ మంజువాణి, ఆకస్మిక తనిఖీ చేశారు. కోఆర్డినేటర్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



వ్యాధులపై విద్యార్థులకు వివరిస్తున్న వైద్య సిబ్బంది

గోరంట్ల : మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది గుమ్మయ్యగారి పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. డయేరియా, అతిసార, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, దోమతెరలు వాడాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది సుచిత్ర, విజయ్‌కుమార్, శాంతి, ప్రధానోపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, ఆశకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

అగళి : వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత వలన డయేరియా వ్యాధి రాకుండా అరికట్టవచ్చని డాక్టర్. శివానంద గాయత్రి సూచించారు. మంగళవారం అగళి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్టాప్ డయేరియా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండాలని, ఆహార పదార్థాల మీద ఈగలు వాలకుండా శుభ్రంగా మూతలువేసి ఉంచుకోవాలని, చంటి బిడ్డలను కూడా చేతులు శుభ్రం చేస్తూ ఉండాలన్నారు. 0-5సంవత్సరాల చిన్నారులకు ఓఆర్ఎస్ ద్రవాన్ని ఎలా తాగించాలో తెలియజేశారు. ప్రతి గ్రామంలో ఈ వైద్య సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

● ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు బయటపడేనా ..?
● బోగస్ బిల్లులతో రూ.లక్షలు దోచుకున్న వైసీపీ నేతలు

లేపాక్షి, జూలై 2: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. ఉపాధి పనుల్లో అక్రమాలు ఎంతవరకు బయట పడతాయనేది ఉత్కంఠగా మారింది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024మార్చి31 వరకు జరిగిన ఉపాధి పనులను తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించారని, సామాజిక తనిఖీల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తారని ఎంపీడీఓ తెలిపారు. 2024జనవరి1 నుంచి 2024 జూన్ వరకు వారు తనిఖీ నిర్వహిస్తారన్నారు. ప్రజావేదికలో సామాజిక తనిఖీ సమావేశంలో ప్రజావేదికన పూర్తి వివరాలు వెల్లడిస్తారన్నారు.

వైసీపీ నేతల అక్రమాలు బయటపడేనా..?

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రాంతాల్లో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. గతంలో సామాజిక తనిఖీలు, ప్రజావేదికలు తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారని మండల ప్రజలు చర్చించుకున్నారు. అయితే తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మొట్టమొదటి సారిగా చేపడుతున్న ఈ ప్రజావేదికల్లోనైనా అక్రమాలు బయటపడతారా లేదా అని మండల ప్రజలు వేచి చూస్తున్నారు. ఉదాహరణకు మల్బరీ షెడ్డు నిర్మించాలంటే మల్బరీ సాగు ఉండాలి, సాగు ఉన్న భూమిలోనే మల్బరీ షెడ్లువేయాలి. అయితే ఓ వైసీపీ నాయకుడు నిబంధనలను తుంగలో తొక్కి ఎటువంటి మల్బరీ సాగు లేకపోయినా షెడ్డు నిర్మించి ప్రజాధనాన్ని దోచేశాడు. అందుకు సంబంధిత అధికారులు, పూర్తిగా సహాయ సహకారాలు అందించారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే సామాజిక తనిఖీల్లో మల్బరీ షెడ్డు సమాచారం బయటపడుతుందా లేదా అని రైతులు ఎదురుచూస్తున్నారు. పూర్తిగా విచారణ జరిపి ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా సంబంధిత నాయకుడి వద్ద నుంచి రికవరీ చేయాలని ప్రజలను కోరుతున్నారు.



లేపాక్షిలో అక్రమంగా నిర్మించిన మల్బరీ షెడ్డు

మంత్రి నారాయణను కలిసిన మున్సిపల్ సిబ్బంది

హిందూపురం అర్బన్, జూలై 2: గత ప్రభుత్వంలో పూర్తిగా నష్టపోయామని, కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది మున్సిపల్ శాఖా మంత్రి నారాయణను కోరారు. మంగళవారం విజయవాడలో మంత్రిని కలిసిన వారు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరినట్లు ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాబఫకృద్దీన్ తెలిపారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే న్యాయం చేస్తామని తెలిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా మంత్రిని వారు శాలువా తో సత్కరించారు. ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న మున్సిపల్ యూనియన్ నాయకులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

పెనుకొండ రూరల్, జూలై 2 : విరివిగా మొక్కలునాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని బీజేపీ జిల్లా కార్యదర్శి ఎనుమల రామక్రిష్ణ సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు మంగళవారం 'తల్లి కోసం మొక్కలు నాటండి' అన్న కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటామన్నారు.



మొక్క నాటుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

పింఛన్ల సొమ్ము స్వాహా

● వెల్ఫేర్ అసిస్టెంట్‌పై పోలీసులకు ఫిర్యాదు

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూలై 2: శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున పింఛన్ల సొమ్ము పంపిణీ చేయకుండా చేతివాటం ప్రదర్శించాడు. లబ్ధిదారులతో సోమవారం వేలిముద్రలు వేయించుకుని.. సొమ్ము ఇవ్వకుండా వెళ్లిపోయాడు. మొత్తం రూ.8 లక్షల వరకూ కాజేశాడని బాధితులు ఎంపీడీఓ నరసింహమూర్తికి మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంపీడీఓ ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ కూటమి మంజూరు చేసిన కొత్త పింఛన్లను పంపిణీ చేసేందుకు బ్యాంకు నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ శనివారం రూ.42 లక్షలు డ్రా చేశాడు. అదే రోజు సచివాలయంలో పనిచేసే తొమ్మిది మంది ఉద్యోగులకు రూ.3 లక్షలు.. రూ.5 లక్షలు చొప్పున అందజేసి, పింఛన్లు పంపిణీ చేయమని సూచించాడు. తక్కువ వస్తే తనను అడగాలని చెప్పి వెళ్లిపోయాడు. తన వంతుగా పంపిణీ చేయాల్సిన సొమ్మును మాత్రం స్వాహా చేశాడు. సుమారు 50 మంది లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని, డబ్బులు తరువాత ఇస్తానని చెప్పినట్లు బాధితులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలోనూ మల్లికార్జున పింఛన్లను స్వాహా చేశాడని, అప్పట్లో వైసీపీ నాయకులు దుప్పటి పంచాయితీ చేసి అతన్ని కాపాడారని ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థిని అభినందించిన తహసీల్దార్

గోరంట్ల, జూలై 2: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్న గంధం ధీరజ్ ప్రతిభను గుర్తించి తహసీల్దార్ అక్బల్ బాషా మంగళవారం అభినందించారు. ధీరజ్ 'లర్న్ ఈజీ' అనే ఎడ్యుకేషనల్ యాప్‌ను రూపొందించాడు. విషయం తెలుసుకుని విద్యార్థిని కార్యాలయానికి పిలిపించుకోవడమే కాకుండా ఆన్‌లైన్‌లో యాప్ పనితీరును స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం డీఎస్సీ కోసం చాలమంది పోటీ పడుతుండడంతో వారికోసం మాక్ టెస్టు యాప్ రూపొందించాలని తహసీల్దార్ సూచించారు. యాప్ తయారు చేయడానికి తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు.



విద్యార్థి ధీరజ్‌ను అభినందిస్తున్న అక్బల్

అసంపూర్తి భవనాలకు మోక్షం లభించేనా..?

రొళ్ల, జూలై 2: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించబడి నిధుల కొరతతో నిలిచిపోయిన భవనాలకు మోక్షం లభించేనా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని రొళ్ల, మల్లినమడుగు, ఎం.రాయాపురం గ్రామ పంచాయతీల్లో సచివాలయాలు, మిల్క్ బల్క్ సెంటర్, ఆర్‌బీకే భవనం, విలేజ్ హెల్త్ సెంటర్ తదితర భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నిలిచిపోయిన సచివాలయ నిర్మాణం